హిమాయత్‌సాగర్‌కు వెళ్లే రహదారి మూసివేత

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నుంచి హిమాయత్‌సాగర్‌కు వెళ్లే రహదారిని తాత్కాలికంగా మూసివేసినట్లు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. హిమాయత్ సాగర్ వరద గేట్లను తెరవడంతో వరదనీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న నేపథ్యంలో దారిని మూసివేశామన్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... శంషాబాద్‌తో పాటు రాజేంద్రనగర్ నుంచి హిమాయత్‌సాగర్ మీదుగా శివారు ప్రాంతాలకు వెళ్లేందుకు వాహనదారులు ఈ దారిని ఉపయోగిస్తారని తెలిపారు. ప్రస్తుతం వరద గేట్లను తెరవడంతో వరదనీరంతా ఈ బ్రిడ్జిపై నుండి ప్రవహిస్తుందని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా ఈ రోడ్డును తాత్కాలికంగా మూసివేశామన్నారు. శంషాబాద్‌తో పాటు రాజేంద్రనగర్ గుండా ప్రయాణించే వారంతా ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ రోడ్లను వినియోగించాలని సూచించారు.

వరద బాధితులను ఆదుకోవాలి

మణికొండ: భారీ వర్షాలకు నిరాశ్రయులైన పేదలను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఈవీవీ కాలనీ, పుప్పాలగూడ గ్రామం, అలకాపూర్ టౌన్‌షిప్, అంజలిగార్డెన్ తదితర కాలనీలలో పర్యటించి వరద బాధితులను పరామర్శించారు. బీఆర్ఎస్ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, అధికార ప్రతినిధి బి. ఉపేంద్రనాథ్‌రెడ్డి, నేతలు ఎస్.శ్రీకాంత్, ఎ.లక్ష్మణ్‌రావు, షేక్ ఆరీఫ్, కిరణ్, భానుచందర్ పాల్గొన్నారు.

స్తంభాన్ని ఢీకొన్న కారు

శంషాబాద్ రూరల్: అదుపుతప్పిన ఓ కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొనగా పెద్ద ప్రమాదం తప్పింది. వివరాలివీ... మండలంలోని కేబీ దొడ్డి నుంచి రాయన్నగూడ వెళ్లే మార్గంలో గురువారం రాత్రి ఓ కారు వేగంగా వెళ్తూ అదుపుతప్పి ఎడమవైపున ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో కారులోని ఎయిర్‌బెలూన్లు తెరుచుకోగా.. అందులో ఉన్నవారికి పెద్దగా గాయాలు కాలేదు. కరెంటు స్తంభం విరిగి పోవడంతో కరెంటు సరఫరా నిలిచిపోయింది. శుక్రవారం మరమ్మతులు చేపట్టి కరెంటు స్తంభాన్ని మార్చి సరఫరాను పునరుద్ధరించారు.

వరద సాఫీగా వెళ్లేలా చర్యలు

రాజేంద్రనగర్: భారీ వర్షాల నేపథ్యంలో వరద నీరు సాఫీగా పల్లపు ప్రాంతాలకు వెళ్లేలా రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఐదు డివిజన్లలో మాన్‌సూన్ సిబ్బందితో పాటు పారిశుద్ధ్యం, డీఆర్ఎఫ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి, ఏఎంహెచ్ఓలు రజనీకాంత్ సూచించారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షం నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో తమ సిబ్బంది ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. రోడ్లపై నిలిచిన నీటిని తొలగిస్తూ శుక్రవారం ఉదయం వరకు పూర్తిస్థాయిలో పనులను నిర్వహించామన్నారు. శుక్రవారం ఉదయం జల్‌పల్లి చెరువు నుంచి పారుతున్న వరదను పరిశీలించారు.

ప్రభుత్వ పాఠశాల అనగానే శిథిలావస్థలో ఉన్న తరగతి గదులు, చాలీచాలని ఉపాధ్యాయులు, అరకొర సౌకర్యాలు ఉంటాయని అనుకుంటారు. అందుకు భిన్నంగా కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా మణికొండలోని పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిలుస్తోంది. సరిపడా తరగతి గదులు, ఉపాధ్యాయులు, వివిధ ల్యాబ్‌లు, అధునాతన పాఠశాలగా తీర్చిదిద్దారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో బోధన కొనసాగుతుండటంతో 6 నుంచి 10వ తరగతి వరకు ఏకంగా 1420 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి 25 తరగతి గదుల్లో బోధన సాగుతోంది. గతంలో తరగతి గదులు సరిపడా లేకపోవటంతో ఏకంగా అడ్మిషన్‌లను నిలుపుదల చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం వాటిని పెంచి పాఠశాలలో చదువుకోవాలని ఆసక్తితో వచ్చే వారిని చేర్చుకుంటున్నారు.

-మణికొండ



మణికొండ పీఎం శ్రీ ఉన్నత పాఠశాల

మణికొండ సర్కారు బడికి...

కార్పొరేట్ సొబగులు!

ఆదర్శంగా నిలుస్తున్న పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

- సైన్స్ ల్యాబ్, కంప్యూటర్స్‌లో బోధన
- ఆట, పాటల్లోనూ రాణిస్తున్న విద్యార్థులు
- ఫలితాల్లో మండలంలోనే అగ్రస్థానం



గ్రంథాలయంలో విద్యార్థినులు

వివిధ సంస్థల సహకారంతో...

- మణికొండ పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు అనేక సంస్థలు, దాతలు ముందుకు వచ్చి తమ వంతు సేవలను అందిస్తున్నారు.
- క్యాపిటల్ ల్యాండ్ సంస్థ రూ. 1.50 కోట్లకు పైగా ఖర్చుతో నిర్మాణ్ ఆర్గనైజేషన్‌తో కలిసి 9 అదనపు తరగతి గదులు, 30 వరకు మూత్రశాలలు, మరుగుదొడ్లను నిర్మించింది. మరో విడతగా రూ. 2 కోట్లతో మరో 9 అదనపు తరగతి గదులు, మరో 30 మూత్ర శాలలు, అధునాతన సౌకర్యాలతో కార్యాలయాన్ని నిర్మించేందుకు నిర్ణయించారు.
- సింక్రోని ఐటీ సంస్థ 30 కంప్యూటర్‌లతో ల్యాబ్‌ను ఏర్పాటు చేసి ఓ శిక్షకురాలిని నియమించి విద్యార్థులకు శిక్షణ ఇస్తుంది.
- చుబ్ అనే మరో సంస్థ సదర్‌ల్యాండ్ ఆర్గనైజేషన్‌తో కలిసి మరో కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు.
- రెడ్ క్యాబ్ సంస్థ పాఠశాలకు అవసరమైన 2కేవీ సోలార్ విద్యుత్ ప్యానల్లను ఏర్పాటు చేసింది.
- ఆర్క్ సంస్థ ఇద్దరు పీఈటీలను, జడ్ పెట్ సంస్థ నలుగురు టీచర్లను ఏర్పాటు చేసి విద్యార్థులను చదువులతో పాటు అనేక రంగాలలో తీర్చి దిద్దుతున్నారు.
- సంస్థలతో పాటు స్థానిక దాతలు, మాజీ ప్రజాప్రతినిధులు పాఠశాలలో సీసీ కెమెరాలు, రంగులు వేయటం, ఫర్నిచర్, ప్రైవేటు ఉపాధ్యాయుల నియామకం, తాగునీరు లాంటి సౌకర్యాలను కల్పించారు.



కంప్యూటర్స్‌లో శిక్షణ పొందుతూ...

ప్రతి తరగతికి మూడు సెక్షన్లు...

ప్రతి తరగతికి వందల సంఖ్యలో విద్యార్థులు ఉండటంతో వారిని ఉపాధ్యాయుల సంఖ్యకు అనుగుణంగా తెలుగు, ఇంగ్లిష్ మీడియంలకు అనుగుణంగా ఏ,బీ,సీ సెక్షన్‌లను ఏర్పాటు చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ఒక్క 8వ తరగతిలో 277 మంది, 9వ తరగతిలో 329 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. రాబోయే రోజుల్లో వచ్చే అడ్మిషన్‌లకు అనుగుణంగా కొత్తగా వచ్చే అదనపు తరగతులు అందుబాటులోకి వస్తే మరిన్ని సెక్షన్‌లను ఏర్పాటు చేసే దిశగా ఆలోచన చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగానే పదవ తరగతి ఫలితాలలో 2024వ సంవత్సరంలో మండల పరిధిలో మొదటి స్థానంలో నిలవగా 2025వ సంవత్సరం రెండవ స్థానంలో నిలిచింది. ఈ పాఠశాల విద్యార్థులు జిల్లా, మండల స్థాయిల్లో ఉత్తమ మార్కులు సాధించి అందరి మెప్పు పొందారు.



ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్ పాఠాలు వింటున్న విద్యార్థులు

బోధనలో వినూత్నం...

ప్రభుత్వ పాఠశాల అనగానే పుస్తకాల్లో ఉన్న పాఠాలు చెపితే చాలనుకుంటారు. అందుకు భిన్నంగా మణికొండ పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అటు ఉపాధ్యాయుల బోధనలతో పాటు పెద్ద స్క్రీన్‌లలో ఆన్‌లైన్ విద్యాబోధన, కంప్యూటర్ శిక్షణ, కుట్లు, అల్లికలు, సైన్స్ ల్యాబ్, పలు రకాల ఆట, పాటలు, టెక్నికల్ ల్యాబ్, అధునాతన గ్రంథాలయం ఆధారంగా విద్యార్థులకు వారికి నచ్చిన రంగంలో అదనపు శిక్షణ అందిస్తున్నారు. విద్యార్థులు ఉత్సాహంగా నేర్చుకుంటున్నారు. విద్యార్థులకు అదనపు బోధనలను అందించే నాలుగు ల్యాబ్‌లను బుధవారం జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు ప్రారంభించటంతో అవి అందుబాటులోకి వచ్చాయి.



అన్ని హంగులు

ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పాఠశాలను అన్ని హంగులతో తీర్చిదిద్దాం. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, ఉపాధ్యాయులతో పాటు అదనపు శిక్షణలు ఇచ్చేందుకు శిక్షకులు ఉన్నారు. ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు, దాతల సహకారంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం, స్కూల్ డ్రెస్‌లు ఉచితంగా ఇస్తున్నాం. రాబోయే రోజుల్లో మరో 9 అదనపు తరగతి గదులను నిర్మింప చేసి మరింత మంది విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం కల్పిస్తాం. పీఎంశ్రీ పథకంలో పాఠశాలను చేర్చి అదనపు సౌకర్యాలను విద్యార్థులను అందించేందుకు కృషి చేస్తున్నాం. మాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నా.

- హెచ్.వి.నిరంజన్, హెచ్ఎం, మణికొండ ఉన్నత పాఠశాల

కంప్యూటర్ బేసిక్స్ వచ్చు



చదువుతో పాటు కంప్యూటర్ నేర్చుకోవాలని ఉన్న కోరికను తీర్చుకుంటున్నాను. దానికి ఓ శిక్షకురాలు ఉండి గంట సమయం కేటాయించి అవసరమైన శిక్షణ ఇస్తున్నారు. దాంతో మొదటి సంవత్సరంలోనే కంప్యూటర్స్ బేసిక్స్ అన్నీ నేర్చుకున్నాను. ఎంఎస్ ఆఫీస్‌లో డాటా ఎంట్రీ చేయటం సైతం వచ్చు. రాబోయే రోజుల్లో మరింతగా నేర్చుకుని ఐటీ ఇంజనీర్ కావాలనే కలను నెరవేర్చుకుంటాను.

- పూజ, 8వ తరగతి

కుట్లు, అల్లికలు...



చదువులతో పాటు మాకు ఇష్టమైన రంగంలో అదనపు శిక్షణ ఇస్తున్నారు. ప్రత్యేక శిక్షకురాలు పాఠశాల స్థాయిలోనే ఇలాంటివి నేర్పించటం మా అదృష్టం. అన్ని సబ్జెక్ట్‌లకు సరిపడా ఉపాధ్యాయులతో పాటు అదనపు శిక్షకులు ఉండటంతో సమయం వృథా చేయకుండా వీలైనన్ని ఎక్కువ నేర్చుకుంటున్నాం. ఇలాంటి సౌకర్యాలను తమకు అందించిన సంస్థలు, ప్రభుత్వాలకు కృతజ్ఞతగా ఉంటాం.

- ప్రణీత, 7వ తరగతి

మూసీ పరీవాహక ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్

బండ్లగూడ: ఎగువ ప్రాంతాల్లో నుంచి వరదనీరు భారీగా హిమాయత్‌సాగర్ జలాశయంలోకి రావడంతో జలాశయం నాలుగు క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువ ప్రాంతంకు వదలడంతో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూసీ, మూసీ పరీవాహక ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించి తదితర ప్రాంతాలను పరిశీలించారు.



ప్రజలతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం

అత్తాపూర్: శేరిలింగంపల్లి ప్రాజెక్టు హైదర్‌గూడ సెక్టార్ ఎర్రబోడ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా సీడీపీవో కె.కవిత, సూపర్‌వైజర్ శారదలు ఆపల్గొన్నారు. తల్లిపాల విశిష్టత గురించి తల్లులకు వివరించారు. బిడ్డ పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు అందిస్తే ఎంతో మేలు జరుగుతుందని సీడీపీవో కవిత స్పష్టం చేశారు. తల్లిపాలు అమృతం లాంటివి అని అన్నారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయించారు. హైదర్‌గూడ సెక్టర్ అంగన్‌వాడీ టీచర్స్ ఆర్.అనిత, అరుణ తదితరులు పాల్గొన్నారు.



తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న సీడీపీవో కవిత, సూపర్‌వైజర్ శారద తదితరులు

హిమాయత్‌సాగర్ నాలుగు క్రస్ట్ గేట్ల ఎత్తివేత

- పరీవాహక ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండండి
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



పూర్తిస్థాయికి చేరుకున్న నీటి మట్టం



హిమాయత్‌సాగర్ గేట్లు ఎత్తడంతో మూసీలోకి పారుతున్న వరద

బండ్లగూడ: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు హిమాయత్‌సాగర్‌కు వరద ప్రవాహం ఎక్కువ అవుతోంది. నిండుకుండలా ఉన్న సాగర్ వరద నీటితో కళకళలాడుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయికి చేరుకోవడంతో జలమండలి అధికారులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం రాత్రి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ చేతుల మీదుగా ఒక గేటును తెరిచి నీటి ప్రవాహాన్ని మూసీ నదిలోకి మళ్లించారు. అయినా ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరుతుండటంతో జలమండలి అధికారులు మరో మూడు గేట్లను ఎక్కి ఎత్తి నీటిని మూసీలోకి పంపిస్తున్నారు. 5, 8, 10, 12వ నెంబర్ గేట్లను ఒక ఫీట్ మేర ఎత్తి వరద నీటిని కిందకి పంపిస్తున్నారు.

మొత్తం నీటి మట్టం...

హిమాయత్‌సాగర్ చెరువు పూర్తిస్థాయి నీటి మట్టం 1763.50 అడుగులుగా ఉంది. ప్రస్తుతం ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షానికి వరద నీరు పెద్ద ఎత్తున సాగర్‌లోకి వస్తున్నాయి. నీటి ప్రవాహంతో ప్రస్తుతం నీటి మట్టం 1763.10 అడుగుల మేరకు చేరుకుంది. దీంతో నాలుగు గేట్లను ఒక అడుగు మేర ఎత్తి వరద నీటిని మూసీలోకి పంపిస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు సాగర్‌లోకి 1300 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. నాలుగు గేట్ల ద్వారా 1400 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

హిమాయత్‌సాగర్ నీటి మట్టం పూర్తి స్థాయికి చేరుకోవడంతో జలమండలి అధికారులు గేట్లు తెరిచే ముందు మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ ప్రాంతాలలో డబ్బులు, సౌండ్ బాక్సులు, వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఉండకూడదని హెచ్చరించారు. నీటి మట్టం పూర్తి స్థాయికి చేరుకోవడం సాగర్ గేట్లు ఎత్తుతున్నాని ఈ ప్రాంతాల్లో ఉండడం ప్రమాదన్నారు. అధికారులు, సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేసి వారిని మూసీకి దూరంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉండవద్దు: జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఎంతో జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. కుండపోతగా వర్షం కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం జంట జలాశయాలైన గండిపేట్, హిమాయత్‌సాగర్‌లకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరుతోందన్నారు. హిమాయత్ సాగర్ చెరువు పూర్తిస్థాయికి చేరుకోవడంతో నాలుగు గేట్ల ద్వారా నీటిని దిగువకు మళ్లిస్తున్నామన్నారు. ఉస్మాన్‌సాగర్ చెరువుకు సైతం ఎగువ ప్రాంతాల నుంచి వర్షం నీరు వచ్చి చేరుతుందన్నారు. ఈ చెరువు సైతం పూర్తిస్థాయికి చేరుకునే అవకాశం ఉందన్నారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ప్రజలు ఎవరు ఉండవద్దు అన్నారు. అవి కురుస్తున్న వర్షాలకు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. దీనిని ప్రజలంతా గుర్తుంచుకోవాలన్నారు. ఎవరికైనా ఇబ్బందులు ఉంటే గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలిపితే వారు కమ్యూనిటీ హాల్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో నివాసం ఏర్పాటు చేస్తారన్నారు. అధికారులకు ప్రజలంతా పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర, ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ సుదర్శన్, చీఫ్ జనరల్ మేనేజర్ బ్రిజేష్, జనరల్ మేనేజర్ సంతోష్‌కుమార్, డీజీఎం గోవింద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని అన్ని శాఖల్లో బీసీ సెల్‌లను ఏర్పాటు చేయాలి

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఏజీ వర్సిటీలో బీసీ సెల్‌ను ప్రారంభం



బీసీ సెల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలనా భవనంలో బీసీ సెల్‌ను శుక్రవారం రాష్ట రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. రాష్ట బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, పీజేటీఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యల సమక్షంలో బీసీ సెల్ ఆఫీసర్ ఇన్‌చార్జిగా నియమితులైన ప్రొఫెసర్ డాక్టర్ సి.హెచ్.దామోదర రాజుని పొన్నం ప్రభాకర్ లాంఛనంగా కుర్చీలో కూర్చోబెట్టారు. ఉదయం పరిపాలన భవనానికి వచ్చిన పొన్నం ప్రభాకర్ తొలుత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, ప్రొఫెసర్ జయశంకర్‌ల చిత్రపటానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. బీసీ సెల్‌ని ప్రారంభించిన అనంతరం రాజేంద్రనగర్ కళాశాలకి అనుబంధంగా ఉన్న అకడమిక్ బ్లాక్‌లోని సెమినార్ హాల్‌ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. తరువాత విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మత్రి మాట్లాడుతూ... విశ్వవిద్యాలయంలో బీసీ సెల్‌ను ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అన్ని శాఖలు, విద్యా సంస్థల్లో బీసీ సెల్‌లను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. బీసీ సెల్‌ల ఏర్పాటు ఎవరికి వ్యతిరేకం కాదన్నారు. విశ్వవిద్యాలయం ఏర్పాటై 60 ఏళ్లకి ఉపకులపతిగా బీసీ వ్యక్తి నియమితులవడం, బీసీ సెల్ ఏర్పాటు చేయడం హర్షదాయకమని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. భారతదేశం విభిన్న వర్గాలు, కులాల సమాహారం అని అందరూ అందరి అభివృద్ధికి కలిసి పని చేయాలన్నారు. బీసీ సెల్ ఏర్పాటుతో విశ్వవిద్యాలయంలోని బీసీ ఉద్యోగులు, విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ కళాశాల అసోసియేటెడ్ డీన్ గోవర్ధన్, బీసీ సెల్ ఇన్‌చార్జి ఆఫీసర్ సిహెచ్. దామోదర రాజు తదితరులు పాల్గొన్నారు.



శివరాంపల్లిలో..



బండ్లగూడలో..

వరాలతల్లీ వందనం



నార్సింగిలో..



మణికొండలో ..

శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారి ప్రతిమలు, మండపాలను ఏర్పాటు చేసుకుని పూజలు చేశారు. ఐదు రకాల ప్రసాదాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ముత్తైదువులకు పసుపు, కుంకుమలను ఇచ్చి ఆశీర్వాదాలను తీసుకున్నారు.

-రాజేంద్రనగర్ జోన్ బృందం: